క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారం గ్రామంలో వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆధ్వర్యంలో చేరారు. ఆదివారం గంగారంలో ఆత్మీయ సమావేశం గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగారం గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. యువత మొత్తం బీఆర్‌ఎస్ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. పార్టీకి కార్యకర్తలు, నాయకులే పట్టు కొమ్మలన్నారు. బంగారు తెలంగాణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కష్టపడ్డ వారందరికీ సముచిత స్థానం లభిస్తుందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చేసిన అభివృద్ధి చూసి బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గౌతమ్ గౌడ్, వారా హరిష్ రావు, రఘునాథ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, ప్రవీణ్, రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గవర్నర్లను కలిసిన గజ్జల యోగానంద్



గచ్చిబౌలి: ఇద్దరు గవర్నర్లను బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి గజ్జల యోగానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని కలిసి వారిని సన్మానించి, పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఇద్దరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ.. వారిద్దరిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు, గతంలో నుంచి వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొంటూ నగరంలో ఉండడంతో ఇద్దరినీ కలిసినట్లు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

మాదాపూర్: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జవేద్‌బాబు హవారీ (38) మహారాష్ట్రలోని పాల్గర్ జిల్లా అయేషా చాల్‌కు చెందిన వ్యక్తి ఆటో రిక్షా ద్వారా జీవనోపాధిని సాగిస్తున్నాడు. భార్య అయిదుగురు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. నిందితుడు గంజాయి తాగేందుకు అలవాటు పడ్డాడు. ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ ధరకు గంజాయి లభిస్తుందని తెలిసిన వ్యక్తుల ద్వారా సమచారం తెలుసుకుని గంజాయి విక్రయించి డబ్బును సంపాదించాలని భావించాడు. కాకినాడ జిల్లా, పత్తిపాడుకు చెందిన తేజస్ వద్ద నుంచి మూడేళ్లుగా గంజాయి కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించి డబ్బును సంపాదిస్తున్నాడు. తేజస్ వద్ద రూ.3 లక్షల విలువ గల 20 కిలోల గంజాయిని కొనుగోలు చేసి ఒక పెద్ద ట్రావెల్ బ్యాగులో, చిన్నసైజు బ్యాగులో ప్యాక్ చేసి 21.10.2023న తెల్లవారు జామున రైలులో ప్రయాణం చేసి మధ్యాహ్నం 1.30 గంటలకు మాదాపూర్‌లోని హైటెక్ సిటీ రైల్వేస్టేషన్‌లో రైలు దిగి స్టేషన్ వెలుపల వేచి ఉండగా విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుడి వద్ద ఉన్న గంజాయిని పట్టుకున్నారు. నిందితుడు జవేద్‌బాబు హవారీని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. తేజస్ పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నలగండ్ల హుడా రెసిడెంట్స్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో..



ఆల్విన్ కాలనీలోని వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ తదితరులు



మియాపూర్ రెడ్డీస్ కాలనీలోని శ్రీజ బృందావనంలో..

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..







హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని మైహోమ్ భుజ గేటెడ్ కమ్యూనిటీలో..

గచ్చిబౌలి/శేరిలింగంపల్లి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు సద్దుల బతుకమ్మ రోజు ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి, చందానగర్ జంట సర్కిళ్ల పరిధిలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుపూలతో అందంగా బతుకమ్మలను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజించి ఆడుతూపాడుతూ సందడిగా బతుకమ్మను నిర్వహించారు. జంట సర్కిళ్లలోని కాలనీలు, బస్తీలలోనే కాకుండా అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలలో కూడా బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని మైహోమ్ భుజలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయాన్-3 తరహాలో బతుకమ్మను పేర్చి అంకితం ఇస్తున్నట్లుగా కనిపించేలా తయారు చేసి తమ సంఘీభావాన్ని దేశ భక్తిని, దేశ సాంకేతిక పరిజ్ఞానాన్ని మెచ్చుకోవడం అందరినీ ఆకట్టుకుంది.

సాక్షి,సిటీబ్యూరో: నలగండ్ల హుడా రెసిడెంట్స్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా విభాగం బాధ్యులు సరిత, హరిణి, విజయ, సరస్వతి, సమత, కృష్ణ ప్రియ, సునీత, ప్రవల్లిక, కృష్ణవేణి, శ్వేత తదితరులు పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు.



అపర్ణా గ్రాండే గేటెడ్ కమ్యూనిటీలో..



తారానగర్‌లో..



చందానగర్‌లో..

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు



అలిండ్ క్యాంపస్‌లో జలజకుమారి, మురళీధర్ నివాసంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

శేరిలింగంపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంటోంది. శేరిలింగంపల్లిలోని అలిడ్ ఎంప్లాయీస్ హౌసింగ్ కాలనీలో నివాసముండే నందు, జలజకుమారి, మురళీధర్, శ్రీజ, శ్రీపూజ ఆధ్వర్యంలో దసరా పర్వదినం బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. ఈ బొమ్మల కొలువును 5 రోజులపాటు నిర్వహిస్తారు. ఈ బొమ్మల కొలువులో దశావతారాలు, కొండపల్లి బొమ్మలు, భాగవతం, రామాయణం, భగవద్గీతా చోటాభీమ్, చుట్కి, జగ్గు, కాలియా, రాజు, డోలు, బోలు, మోటు,పత్లు, సింగం, డాక్టర్ ఝుటకా, పల్లెటూరు సంత, పల్లెటూరు వాతావరణం సంబంధించిన బొమ్మలు, పెళ్లి పల్లకీ వంటివి అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈ బొమ్మల కొలువు 5, 7, 9, 11 మెట్లపై ఏర్పాటు చేశారు. పై వరుసలోని మెట్లపై దేవుని బొమ్మలు, అమ్మవారి బొమ్మలు ఉంచుతారు. కనుక ఈ చోటును సత్వగుణానికి నిర్వచిస్తారు. కింద మెట్లపై ప్రాపంచిక జీవితానికి సంబంధించిన బొమ్మలు ఉంచుతారు. కనుక ఈ చోటు తాపస గుణాన్ని ప్రతిబింబిస్తాయి. ఇక మధ్య మెట్లపై క్షత్రియ ధర్మాన్ని తెలిపే రాజు, రాణి, యుద్ధవీరుల బొమ్మలు ఉంచుతారు. ఇక అన్నిటికన్నా పై మెట్టుపై ఉండే దేవీ ప్రతిమ, అమ్మవారి కరుణకు సూచనగా భావిస్తారు. ఈ పై గుణాలను తెలిపేదే అమ్మవారి బొమ్మల కొలువుగా నిర్వాహకులు వివరించారు. ఈ తత్వాలను అధికమించిన వారికి దేవీ కటాక్షం లభ్యమవుతుంది. బొమ్మల మెట్లపై తెల్లటి వస్త్రాన్ని పరిచి ఆపై బొమ్మలను అమర్చుతారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జలజకుమారి, మురళీధర్, శ్రీజ, శ్రీపూజ మాట్లాడుతూ.. ప్రతియేటా ఈ బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అపార్ట్‌మెంటువాసులతో పాటు స్థానికులంతా తిలకిస్తారన్నారు. 5 రోజుల పాటు కొనసాగే ఈ బొమ్మల కొలువుకు ప్రతిరోజూ పూజలను నిర్వహిస్తామని, ప్రతిరోజూ వచ్చిన వారిలో పెద్దలకు తాంబూలం, పిల్లలకు కానుకలు, బహుమతులు అందిస్తామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, సుబ్రహ్మణ్యం, రఘుమల్లిక్, శ్రీవిద్య, వాసు, నవ్య, కాత్యాయని, భవాని, మధురవాణి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



అనీల్‌కుమార్‌యాదవ్ అభినందిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: బీజేపీ శేరిలింగంపల్లి నాయకుడు అనీల్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను మసీదుబండలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ, బీజేవైఎం, వివిధ మోర్చాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఉదయం నుంచి ఆయనను కలిసి శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలను అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఆయనను అభినందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా సారీమేళాలో సందర్శకులు చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ప్రధాన లాన్‌లో ఏర్పాటు చేసిన బతుకమ్మ వద్ద సందర్శకులు, సిబ్బంది పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం గీతగణేశన్ శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శనతో కళాకారులు సందర్శకులను ఆకట్టుకున్నారు. మహిసాసురమర్ధిని నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. మహతి కళా సమితి శిష్యబృందం సౌమ్య, లహరి, శారదా, కోమల, సంధ్య, అష్మితలు కూచిపూడి నృత్యప్రదర్శనలో తాండవమాడెను, జతిస్వరం, దుర్గే, దశావతారాలు, కామాక్షి స్తుతి, సౌందర్యలహరి తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు వైస్‌చాన్సలర్‌గా అవకాశం



ప్రొఫెసర్ అనంతకృష్ణన్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు వైస్‌చాన్సలర్‌గా అవకాశం కలిగింది. కేరళ కళామండలం వైస్‌చాన్సలర్‌గా హెచ్‌సీయూ ప్రొఫెసర్ అనంతకృష్ణన్ నియమితులయ్యారు. ప్రొఫెసర్ అనంతకృష్ణన్ హెచ్‌సీయూలోని సరోజినీ నాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ థియేటర్ ఆర్ట్స్ విభాగానికి అధిపతిగా కొనసాగుతున్నారు. కాగా అతను పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ నుంచి డ్రామా, థియేటర్ ఆర్ట్స్‌లో ఎంఏ పట్టా పొందాడు. పీహెచ్‌డీని మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి సమకాలీన మలయాళ థియేటర్‌లో పూర్తి చేశారు. ఆయన సేయింట్ జేవియర్స్ కాలేజ్, యూనివర్సిటీ ఆఫ్ కాలికట్‌లో మునుపటి అనుబంధాలతో ప్రదర్శన, జానపద సాహిత్యంలో కూడా పరిశోధకుడుగా గుర్తింపు పొందారు. 2000 నుంచి అతను హెచ్‌సీయూలోని సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. ది ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ థియేటర్ రీసెర్చ్(ఐఎఫ్‌టీఆర్) ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా, ఇండియన్ సొసైటీ ఆఫ్ థియేటర్ రీసెర్చ్(ఐఎస్‌టీఆర్) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా అతని రచనలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయి. కాగా ప్రొఫెసర్ అనంతకృష్ణన్‌కు భారతీయ ప్రదర్శన అధ్యయనాల పట్ల ఉన్న మక్కువ, థియేటర్ ఇండియా, థియేటర్ రీసెర్చ్ ఇంటర్నేషనల్ వంటి పత్రికల్లో అతని ప్రచురణలు, అలాగే ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ ఏషియన్ థియేటర్ వంటి ఎన్‌సైక్లోపీడియాలకు ఆయన చేసిన కృషిలో స్పష్టంగా కనిపిస్తుంది.

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నందీశ్వర్ గౌడ్



నందీశ్వర్ గౌడ్

పటాన్‌చెరు: నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా టి. నందీశ్వర్‌గౌడ్‌ను బీజేపీ అధిష్ఠానం ప్రకటించింది. 2009–14 వరకు ఆయన పటాన్‌చెరు ఎమ్మెల్యేగా ఉన్నారు. 1989లో పటాన్‌చెరు తొలి ఎంపీపీగా ఎన్నికయ్యారు. 1997 నుంచి 2000 వరకు ఉమ్మడి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 2007లో కాంగ్రెస్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా, 2009లో పటాన్‌చెరు నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా పనిచేశారు. 2017లో అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు.

ఈర్ల చెరువు వద్ద అరకొర పనులు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు వద్ద బతుకమ్మ నిమజ్జనానికి జీహెచ్‌ఎంసీ అధికారులు అరకొర పనులు చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఈర్ల చెరువును స్థానికులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు సుందరీకరణ పనులతో కోట్ల రూపాయలతో శంకుస్థాపనలు చేస్తున్నారే కానీ పనులు ప్రారంభం కావడంలేదన్నారు. నిధులు మంజూరైన పనులు పూర్తి చేయకుండా వేరొక పనులు నిర్వహిస్తున్నానన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్‌రావు, యాదగిరి, ఎల్లేష్, అశోక్ గౌడ్, శంకర్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఆంజనేయులు, బండారి యాదవ్, దయాకర్‌రెడ్డి, భరత్, శివా, రవి, అశోక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో అంతటా జరుపుకుంటున్నారు. అందులో భాగంగా ఆదివారం అమ్మవార్లను దుర్గాదేవీ అవతారంలో ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అష్టోత్తరపూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేశారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఇప్పటికే ఆలయాలను పూలు, మామిడి ఆకులు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. రాత్రి వేళ ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక భజన కార్యక్రమాలను నిర్వహించారు.



జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లో దుర్గాదేవీగా రాజరాజేశ్వరిమాత



గచ్చిబౌలిలో దుర్గాదేవీగా అన్నపూర్ణాదేవిమాత



రాయదుర్గంలో..



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..



నానక్‌రాంగూడలోని పూజారిబస్తీలో..



రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో..

అత్యుత్తమ సేవలు అందించడమే లక్ష్యం



స్కోడా వాహనాలను వినియోగదారులకు అందజేస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్: అత్యుత్తమ సేవలు అందించడమే మహావీర్ గ్రూప్ లక్ష్యమని మహావీర్ ఆటో మేనేజింగ్ డైరెక్టర్ పార్శ్వకుమార్ పేర్కొన్నారు. ఆదివారం రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో ప్రఖ్యాత మహావీర్ గ్రూప్‌లో భాగమైన మహావీర్ స్కోడా 101 సరికొత్త స్కోడా కార్లను ఒక్కసారిగా డెలివరీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలకు అద్భుతమైన కిక్ ఆఫ్‌లో, ప్రఖ్యాత మహావీర్ గ్రూప్‌లో భాగమైన మహావీర్ స్కోడా తమ గర్వించదగిన యజమానులకు 101 సరికొత్త స్కోడా కార్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వరంగల్, గుంటూరు తదితర ప్రాంతాల్లో నూతన షోరూంలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. స్లావియా, కుషక్ వాహనాలకు పెరుగుతున్న ఆదరణ సంస్థకు ఎన్నో లభిస్తుందన్నారు. నగరంలో మూడు షోరూంలు ఉన్నాయని రానున్న రోజుల్లో మరింత విస్తరించనునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కోడా ఆటో ఇండియా మార్కెటింగ్ హెడ్ రాహుల్ పన్సారే, మహావీర్ గ్రూప్ చైర్మన్ యశ్వంత్ జబఖ్, జీత్ ఝబఖ్ తదితరులు పాల్గొన్నారు.